ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కలీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 30 ఆక్టోబరు, 2026 | పేజీలు : 08

ప్రజాసేవలో నిజాయితీ, పారదర్శకత ప్రతి ఉద్యోగి బాధ్యత

అదనపు కలెక్టర్ ప్రసూనాంబ



ప్రజాపక్షం/జగిత్యాల: ప్రజాసేవలో నిజాయితీ, పారదర్శకత ప్రతి ఉద్యోగి బాధ్యత అని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ పేర్కొన్నారు.విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అవగాహన సమావేశం,సమగ్రత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రసూనాంబ, అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాసేవలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం,ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలకు నిబంధనల మేరకు సకాలంలో సేవలందించాలని, విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ మహేందర్ రెడ్డి, సీఐ ప్రేమ్ అవినీతి నివారణ, ఉద్యోగుల నైతిక బాధ్యతలు, విధుల నిర్వహణలో పాటించాల్సిన విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ : జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని, స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని,అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ నిర్మల్ పట్టణ, గ్రామీణ మండలాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ సంస్థలు,అభివృద్ధి పనులను పరిశీలించారు.సోఫీనగర్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్,విద్యార్థులకు మెరుగైన భద్రతతోపాటు నాణ్యమైన విద్య,పౌష్టికాహారం అందించాలని సూచించారు.కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు,సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్ పరీక్షల సమయానికి సిలబస్ పూర్తిచేయడంతోపాటు,విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు.ఎంఈసీ విభాగం విద్యార్థులతో మాట్లాడి విద్య, భోజనం, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి, ప్రతిభ కనబరిచిన వారిని అభినందించి పెన్నులను బహుమతిగా అందజేశారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.దివ్యనగర్‌లోని స్పోర్ట్స్ అరీనాను పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని,క్రీడలు ఆడేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. షటిల్ బ్యాడ్మింటన్, పికిల్‌బాల్ కోర్టుల పరిసరాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు.మహాలక్ష్మీవాడ సమీపంలోని అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, జంతువుల స్టెరిలైజేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఖానాపూర్, భైంసా ప్రాంతాల్లోనూ అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.డంప్ యార్డును పరిశీలించిన కలెక్టర్,తడి,పొడి చెత్త వేర్పాటు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. గండిరామన్న నుంచి కమలానగర్ వరకు చేపడుతున్న అటవీ, రెవెన్యూ భూముల రీసర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో డివిఎహెచ్ఓ సురేష్ ,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు రాజు, ప్రభాకర్, హరిభువన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ పునఃసర్వే పనులు
నిర్ణీత గడువులోగా పూర్తి



కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/సుల్తానాబాద్ ఃభూ పునఃసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన,కార్యాలయంలోని రికార్డులు, భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ పునఃసర్వే మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.భూ భారతి కింద అందిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని,ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. గడువు దాటిన దరఖాస్తులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల మేరకు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, సుల్తానాబాద్ తహసీల్దార్ బషిరుద్దీన్,తదితర అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/కరీంనగర్ఃఃనగర పారిశుద్ధ్య నిర్వహణను మరింతగా మెరుగు పరచాలని...సిబ్బంది, కార్మీకుల పనితీరును మెరుగు పరుచుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య నిర్వహణ లో భాగంగా గురువారం తెల్ల వారుజామున నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ నగర పరిశుభ్రత, సిబ్బంది కార్మీకుల పనితీరు పై అకస్మిక తనిఖీ చేశారు. నగరంలోని 66 డివిజన్ పరిధిలో స్థానిక కార్పోరేటర్ వంగల పవన్ తో కలిసి టవర్ సర్కిల్ ప్రాంతం మొత్తం పాదయాత్ర తో సుడిగాలి పర్యటన చేసి పారిశుద్ధ్య పనుల తీరును స్వయంగా పరిశీలించారు. సిబ్బంది పని తీరు పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.... ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, పరిసర ప్రాంతాల్లో చెత్త వేసే వారిని గుర్తించి... రూ. 1000 జరిమానాలు విధించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే సంబంధిత అధికార సిబ్బంది పై కఠణచర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణతో పాటు టవర్ సర్కిల్, పాత శివాలయం ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికుల బయోమెట్రిక్,హాజరు పాయింట్లతో పాటు హాజరు రికార్డులను తనిఖీ చేసి.... కార్మికుల హాజరును స్వయంగా పరిశీలించారు. విధుల హాజరయ్యే ముందు సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నగర పరిశుభ్రత పనుల తీరు, చెత్త సేకరణ విధానంపై ఆరా తీశారు. పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేసేందుకు కార్మికులు, సిబ్బంది కి సూచనలు చేస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కార్పోరేటర్ వంగల పవన్, పారిశుద్ధ్య అధికారులతో కలిసి టవర్ సర్కిల్ కమర్షియల్ ప్రాంతంలో సుదీర్ఘంగా పాదయాత్ర చేపట్టారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం మొదలుకొని అన్నపూర్ణ కాంప్లెక్స్, టవర్ సర్కిల్, రాజీవ్ చౌక్, పాస్‌పోర్ట్ ఆఫీస్, శనివారం మార్కెట్ రైతు బజార్, పాత శివాలయం తదితర వీధుల్లో వీధి వీధినా తిరుగుతూ పారిశుద్ధ్య నిర్వహణను నిశితంగా పరిశీలించారు. రోడ్లు, డ్రెయిన్లలో ఎక్కడ పడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న స్థానిక ప్రజలు, వ్యాపారులు, దుకాణదారు పై ప్రత్యేక దృష్టి పెట్టి... నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి రూ. 1000 జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే... కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నగర పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉండేలా కార్మీకుల చర్యలు తీస్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రాజమనోహర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామీ, జవానులు నర్సయ్య, శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మీకులు తదితరులు పాల్గొన్నారు.



గొల్ల కురుమలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలి

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : గొర్రెలు, మేకల పెంపక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ విమర్శించారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని అమృత ఎస్టేట్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత, గీత కార్మికులకు ఇచ్చిన విధంగా గొల్ల కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని ఆసరా పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలను అడవుల్లో మేపుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీ ప్రకటించాలని నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద ఏలాంటిషరతులు లేకుండా రూ.5 లక్షలనుంచి 10 లక్షల వరకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించి జనాభా ప్రాతిపదికన బీసీ కులాల అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్ర కేబినెట్‌లో గొల్లకురుమలకు ప్రాతినిధ్యం కల్పించాలని జీవో నం.559, 1016లనుసవరించి ప్రతి గ్రామంలో గొర్రలు, మేకల మేత కోసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమని కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడంగి శ్రావణ్ కుమార్ యాదవ్, బాలయ్య, సంతోష్ , గజ్జి రమేశ్, వేల్పుల సారంగపాణి, అందె అశోక్, గట్టయ్య, దాడి రాజబాబు, కేశవేణి సత్యనారాయణ పాల్గొన్నారు.




సాగునీటి కాలువలోకి మురుగునీరు



ప్రజాపక్షం/ఎండపల్లి : ఎండపెల్లి మండల పరిధిలోని రాజారాంపల్లి గ్రామంలోని ఎస్ఆర్ఎస్పీ డి83/బి సాగునీటి కాలువలోకి వ్యక్తిగత మరుగు దొడ్ల మురుగునీరు చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ యువకులు గ్రామ కార్యదర్శి దాసరి మల్లేశంకు వినతిపత్రం సమర్పించారు. కాలువలోకి మురుగునీరు వదులుతున్న వారిని త్వరగా గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా అధికారులను డిమాండ్ చేశారు.గ్రామంలోని ఎస్ఆర్ఎస్పీ డి83/బీ కాలువలోకి కొందరు తమ ఇళ్లలోని మరుగుదొడ్ల మురుగునీటిని నేరుగా వదులుతుండటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కాలువలో మురుగునీరు కలవడం వల్ల వ్యవసాయంతో పాటు పరిసరాల పరిశుభ్రత దెబ్బతిని, ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన చెందారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన భూపతి తిరుపతి, బొంగాని రాజేశం,బొంగాని సురేష్,భూసారపు అంజి,బైరి రామచంద్రం,దేవి నరేష్,శ్రీకాంత్,కార్తీక్,సంఘ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు



ప్రజాపక్షం/ముత్తారం: ముత్తారం మండలం కేంద్రంలోని వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్ లో కేషన పల్లి గ్రామానికి చెందిన తోట రాజు దివ్యల వివాహ వేడుక గురువారం ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్క తాట్ల వినీత్ యాదవ్, సర్పంచ్ పెగుడ తిరుమలకుమార్, సమత తిరుపతి , సదయ్య, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు.

కరువు కష్టం తెచ్చింది... కాంగ్రెస్ ప్రభుత్వమే



ప్రజాపక్షం / గంగాధర : రాష్ట్రంలో నెలకొన్న కరువు కష్టానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు డిమాండ్ చేశారు. గంగాధరలో గురువారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రభావిత మండలాల జాబితాలో గంగాధర మండలానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండి నియోజకవర్గంలో అనేక మండలాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నప్పటికీ వాటిని విస్మరించి జాబితాలో కేవలం ఒక్క మండలాన్ని మాత్రమే చేర్చి మిగతా మండలాలను పక్కన పెట్టడం సరైంది కాదన్నారు. ఎలానినో ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రైతాంగం తీవ్ర కష్టాలు పడుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని విమర్శించారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువేనని ధ్వజమెత్తారు. రైతులు ఎన్నో ఆశలు పెట్టుకొని పెట్టుబడి పెట్టి, అప్పులపాలై పంటలు సాగు చేస్తే అవి కళ్లెదుటే ఎండిపోతుంటే గుండెలు ఆవిరైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ వినతిపత్రం ఇచ్చినవారిలో మండల బిఆర్ఎస్ ప్రతినిధులు, నాయకులతోపాటు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల జనాభాపై స్పష్టమైన గణాంకాలు సాధించాలి



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : మున్నూరు కాపుల జనాభాపై స్పష్టమైన గణాంకాలు సాధించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కుల బాంధవులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుండ దేవయ్య పటేల్ తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా కుల ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లోని రాధా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మున్నూరు కాపులు వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్నప్పటికీ కుల ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉండాలని దేవయ్య పటేల్ అన్నారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కంటే సామాజిక అభివృద్ధి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గత రెండు దశాబ్దాలుగా మున్నూరు కాపుల సంఘటిత శక్తి కోసం పని చేస్తున్నానని ఉమ్మడి పది జిల్లాల నుంచి ప్రస్తుత 33 జిల్లాల వరకు సంఘాల ఏర్పాటు నాయకత్వ నిర్మాణంలో భాగస్వామినయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు కోల అన్నారెడ్డి, ఎర్రం రాజు రెడ్డి, నామిని సత్యనారాయణ, కాసరాజు పటేల్, జల్లోజి శ్రీనివాస్, డా.సందీప్ రెళ్ల సరోజ, అరుణ, కుంట సుజాత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే వీలైనంత త్వరగా స్ట్రోక్ రెడీ ఆసుపత్రికి తీసుకెళితే మెరుగైన ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ వైద్యులు వెల్లడించారు. స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనదని లక్షణాలు కనిపించిన వెంటనే స్పందించాలని సూచించారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డా.సంజయ్ కమీన్వర్ , ఎమర్జెన్సీ మెడిసిన్ డా.సత్యనారాయణ, క్రిటికల్ కేర్ డా.ఉపేందర్ రెడ్డి పాల్గొని స్ట్రోక్‌పై అవగాహన కల్పించారు. మెదడుగు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా మెదడులో రక్తనాళం చిట్లడం వల్ల స్ట్రోక్ సంభవిస్తుందని వివరించారు. ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి కాలు కదల్చకపోవడం, మాట తడబడడం, ఆకస్మాత్తుగా చూపు మందగించడం, బ్యాలెన్స్ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడం, రక్తస్రావం జరగడం అనే రెండు ప్రధాన రకాలుంటాయని తెలిపారు. నాలుగున్నర గంటలలోపు సీటీ, ఎమ్మారై స్కాన్, క్యాథలాబ్ సౌకర్యం ఉన్న స్టార్ రెడీ ఆసుపత్రికి తీసుకువస్తే ఐవీ త్రోంబాలైసిన్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తనాళాల్లో ఏర్పడిన గడ్డను కరిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆలస్యం చేయడం వల్ల వైకల్యంతోపాటు ప్రాణాలకే ప్రమాదమన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయని తెలిపారు. రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా ముప్పును తగ్గించుకోవచ్చన్నారు. అన్ని విభాగాల వైద్యులు, పరికరాలు సిద్ధంగా ఉన్న స్టోర్ రెడీ మెడికవర్ ఆసుపత్రిలో వేగవంతమైన పరీక్షలు, సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలు అందడం మూలంగా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ డా.ప్రియాంక, మార్కెటింగ్ హెడ్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ అటనామస్ గెస్ట్ లెక్చరర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాల డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ముద్దసాని మహేందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా ఏ.మల్లేశం, కోశాధికారిగా పి.చైతన్య, ముఖ్య సలహాదారులుగా పోకల నాగయ్య, బుంగ తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా బి.రాజు, ఇ.సమత, రిప్లిక, భోజన్న ఎన్నికయ్యారు. అధ్యక్షుడు ముద్దసాని మహేందర్ మాట్లాడుతూ డిగ్రీ గెస్ట్ అధ్యాపకుల సమస్యలు తీర్చడంలో మావంతుగా కమిటీ సభ్యులం కృషి చేస్తామని తెలిపారు. ఈ నూతన కమిటీని ఉన్నత విద్యాశాఖ జేవీసీ అధ్యక్షులు కడారి సురేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ, స్టాప్ క్లబ్ సెక్రటరీ డా.ఎం.శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

వీర్నపల్లి మార్కెట్ కమిటీ బాధ్యతల్లో మహిళా శక్తి



ప్రజాపక్షం/వీర్నపల్లి: వీర్నపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రభుత్వం మూడో నూతన పాలకవర్గాన్ని బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ సారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మహిళకు కేటాయించడంతో, మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన అర్రోళ్ల మమతను చైర్‌పర్సన్‌గా నియమించారు. అలాగే, అడవిపదిర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పని శివరామకృష్ణ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కమిటీ డైరెక్టర్లుగా మల్లారపు దేవయ్య, దార్ల సుమలత, భూక్య హనుమంతు, భూక్య లింగం, గంగిపల్లి ఇస్తారి, సుతారి దేవరాజు, భూక్య విట్టల్, భూక్య దేవేందర్, జోగినిపెల్లి మల్లేశం, గుమ్మడి రాజేశం లతో పాటు నలుగురు అధికారిక సభ్యులను నియమించారు. నూతనంగా నియమితులైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మరియు సభ్యులకు మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. తమపై నమ్మకంతో ఈ పదవులను అప్పగించిన ప్రభుత్వానికి, సహకరించిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మార్కెట్ యార్డులో మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా నూతన పాలకవర్గం పేర్కొంది.

నాయి బ్రాహ్మణ జనశక్తి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సంజీవ్ నియామకం

ప్రజాపక్షం/గొల్లపల్లి : నాయి బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెంగలాపూర్ గ్రామానికి చెందిన రాసమల్ల సంజీవ్ నియమితులయ్యారు.ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షులు పసుపుకుంట్ల వికాస్ నాయి,కార్యనిర్వాహక అధ్యక్షుడు సికినమెట్ల శివప్రసాద్,ప్రధాన కార్యదర్శి సురేంపల్లి గణేష్ లు సంజీవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు,సమాజ అభివృద్ధికి దోహదపడేలా సంఘ కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు.రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులైన సంజీవ్‌కు నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఎనగందుల తిరుపతి శుభాకాంక్షలు తెలిపారు.సంజీవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అవకాశం కల్పించిన సంఘ నాయకులకు,సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,సంఘ బలోపేతానికి,సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : పోక్సో చట్టం బాలబాలికలకు రక్షణ కవచం లాంటిదని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్ కుమార్ అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సురక్షిత బచ్‌పన్ అభియాన్ పథకంలో భాగంగా మెట్‌పల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలబాలికలు పోక్సో చట్టంలోని నిబంధనలు,తమ హక్కులు,చట్టపరమైన రక్షణ గురించి తెలుసుకోవాలని సూచించారు.బాలిక



లతో పాటు బాలురు కూడా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని,ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయ పడకుండా ఫిర్యాదు చేయాలని తెలిపారు.దగ్గరి బంధు వులు, ఉపాధ్యాయులు లేదా ఇతరుల నుంచి వేధిం పులు ఎదురైనా మౌనంగా ఉండకూడదని పేర్కొన్నారు. బాలల సహాయవాణి 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జూని యర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్యా రాజారాం,ఎంఈఓ కొండ కనక తార,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్,న్యాయవాదులు కొండ ప్రవీణ్ కుమార్,కోటగిరి వెంకటస్వామి,ఆకుల సురక్ష,తలారి రాజశేఖర్,సామ అనిరుద్,కోటగిరి చైతన్య,ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థి నులు పాల్గొన్నారు.

విలేకరిని పరామర్శించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రజాపక్షం/ముత్తారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్తారం మండల సాక్షి దినపత్రిక విలేకరి ఏలువక కుమార్ ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పరామర్శించారు.ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశానుసారం గురువారం కరీంనగర్ లోని కియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కుమార్ ను దొడ్డ బాలాజీ కలిసి పరామర్శించారు.ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని,ధైర్యం చెప్పారు.ఈ పరామర్శించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కం ప్రభాకర్,తోడేటి శశి కుమార్ తోపాటు తదితరులు ఉన్నారు.

గాయత్రి జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థుల రక్తదానం

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళిగా పెద్దపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గాయత్రీ డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు.ప్రాణదానం కంటే గొప్ప దానం లేదనే సందేశాన్ని చాటుతూ,సమాజ సేవలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లంకి శ్రీనివాస్, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నమ్మద్ మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

శానబండ ఖేత్ బచావో అభియాన్

ప్రజాపక్షం/ఎండపల్లి : రైతులకు సేంద్రియ వ్యవసాయం, ఎల్‌నినో ప్రభావంతో పంటలకు కలిగే నష్టాలు, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించేందుకు గురువారం ఎండపల్లి మండలంలోని శానబండ గ్రామంలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుధాకర్, మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ గాధం భాస్కర్ పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత,భూసార పరిరక్షణ,మట్టి పరీక్షల అవశ్యకత ను,రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని రైతులకు వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతంలో అసమానతలు, వర్షాభావ పరిస్థితులు, పంటల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

పంట అవశేషాలను కాల్చవద్దు.. భూమి సారాన్ని కాపాడండి

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : వ్యవసాయ భూముల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని జగిత్యాల అర్బన్ మండల వ్యవసాయ అధికారి బి.వినీల సూచించారు. గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ధరూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన 'కేతు భచావో అభియాన్' కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ వరి కోతల అనంతరం పంట అవశేషాలను పొలాల్లో కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మ పోషకాలు,ఉపయోగకరమైన సూక్ష్మ జీవులు నశించడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరుగుతుందని వివరించారు. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పంట అవశేషాలను పశుగ్రాసంగా కూడా వినియోగించుకోవచ్చని



సూచించారు. రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర, మొక్కజొన్న, నువ్వులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని, నీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు కూరగాయల సాగుపై కూడా దృష్టి సారించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సురేందర్,ఉపసర్పంచ్ బాలె శ్రీను,వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ స్రవంతి,స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డిటిఎఫ్ వీర్నపల్లి మండల నూతన కార్యవర్గం ఎన్నిక...

ప్రజాపక్షం/వీర్నపల్లి: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) వీర్నపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సభ్యత్వాన్ని సేకరించిన అనంతరం, సాయంత్రం జెడ్పీహెచ్ ఎస్ వీర్నపల్లి పాఠశాలలో డీటీఎఫ్ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల శాఖ నూతన అధ్యక్షులుగా గాజంగి తుకారాం(ఎస్ఏ సోషల్, జెడ్పీహెచ్ఎస్ వీర్నపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఖాజామొయినుద్దీన్(ఎన్‌జీటి, ఎంపిపిఎస్ శాంతినగర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా బట్టారి సంపత్ కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఎం విష్ణుప్రసాద్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా డీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు అవురం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపధ్యాయుల పెండింగ్ సమస్యలపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేది



కను తెప్పించుకొని, దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన మండలమైన వీర్నపల్లిలో అత్యధిక పాఠశాలలు కేవలం ఒక్క ఉపాధ్యయునితోనే నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు ఒంటరిగా పని చేస్తున్న పాఠశాలల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే ఆయా పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను కేటాయించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

టాప్‌టెన్ ఇన్నోవేటివ్ టీచర్లలో పారమిత ఉపాధ్యాయుడికి చోటు

ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జాతీయస్థాయిలో అరుదైన ఘనత సాధించాడు. సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రాజెక్ట్ అండ్ ఇన్నోవేషన్ హెడ్‌గా విధులు నిర్వహిస్తున్న లలిత్ మోహన్ సాహు దేశంలోని అత్యుత్తమ 10 వినూత్న ఉపాధ్యాయులలో ఒకరిగా ఎంపికయ్యారు. అక్టోబర్ 28న న్యూ ఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో నిర్వహించిన జాతీయ స్థాయి గ్రాండ్ ఫినాలేలో ఆయనకు వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్2026 ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడిగా లలిత్ మోహన్ సాహు గుర్తింపు పొందడం విశేషం. వివో ఇండియా ఆధ్వర్యంలో ఐఐటీ మద్రాస్, జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి, యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా,సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ తదితర సంస్థల సహకారంతో ఈ జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా వచ్చిన సుమారు 37 వేల ధరఖాస్తుల నుంచి ఐఐటీ మద్రాస్, ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన నిపుణుల



బృందం పలు దశల్లో నిర్వహించిన కఠినమైన ఎంపిక ప్రక్రియ ద్వారా లలిత్ మోహన్ సాహు ను టాప్10 ఉపాధ్యాయుల్లో ఒకరిగా ఎంపిక చేసింది. అవార్డు ప్రధానోత్సవంలో డా.వన్నీర్ సెల్వం, డా.ఎం.జె.శంకర్ రామన్ , టెక్ గురు రాజీవ్ మఖాని, మయాంక్ ప్రభాకర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పాల్గొనేలా మార్గదర్శనం చేస్తున్నారు. సాహును పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద్ రావు పాటు డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనుకర్ రావు, వియుయం ప్రసాద్, రాకేశ్, వినోద్ రావు, హన్మంత్ రావు, ప్రిన్సిపాల్ గోపికృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

లక్ష్యం దిశగా విద్యార్థులు ముందుకు సాగాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ : ప్రతి విద్యార్థిని బాగా చదివి లక్ష్యం దిశగా ముందుకు సాగి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి దారి చూపుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్,మండల బిఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాపక్షం/ముత్తారం : ప్రభుత్వం ఇచ్చేది ఉచితం కాదని, ప్రజలు కట్టిన పన్నుల సొమ్మేనని మాజీ ఎంపీపీ,లక్కారం గ్రామ సర్పంచ్ అత్తే చంద్రమౌళి గుర్తుచేశారు.అధికారులతో కక్షపూరితంగా నివేదికలు ఇప్పించి,పెద్దపల్లిని కరువు జిల్లా కాకుండా చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును జిల్లా రైతాంగం గమనిస్తోందని, త్వరలోనే ప్రజలు ఆయనకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు రైతులకు క్షమాపణ చెప్పాలని,పెద్దపల్లిని కరువు జిల్లాగా ప్రకటించి అన్నదాతలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మంథని



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా ఉత్సాహభరితంగా సాగిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. మొత్తం 35 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో పారుపల్లి, మంథని జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ పోరులో పారుపల్లి జట్టుపై మంథని జట్టు ఘన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది.టోర్నమెంట్ ట్రోఫీని కైవసం చేసుకుంది.అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో విజేతగా నిలిచిన మంథని జట్టుకు బియ్యని శ్రీవల్లి,ఐశ్వర్య రూ.20,000 నగదు బహుమతితో పాటు విజేత కప్‌ను అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన స్థానిక పారుపల్లి జట్టుకు గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ రూ.10,000 నగదు పురస్కారాన్ని,ట్రోఫీని బహూకరించారు.ఈ ముగింపు వేడుకల్లో పలువురు గ్రామ నాయకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను ఎలాంటి ఆటంకాలు లేకుండా,అత్యంత విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు చొప్పరి సాయికిరణ్, బోడ పవన్, ఏడవేనా కౌశిక్‌లను సర్పంచ్‌తో పాటు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పలువురు వక్తలు కొనియాడారు.


బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాటుకూరి సత్యనారాయణ రెడ్డిని మినీ ట్యాంక్ బ్యాండ్ వాకర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజేశం, అవ్వ సురేష్,రవీందర్, శ్రీనాథ్, వైభవ్ శ్రీను, గుంపుల శ్రీను, గణేష్, దిశ్ సంతోష్, సాడె, మధు, రవీందర్ రావు, ఆలువాక లక్ష్మణ్, భాస్కర్, ఆర్టీఓ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠికను మాయంపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ ప్రతినిధి : నూతనంగా నిర్మిస్తున్న పెద్దపల్లి బస్ డిపో ప్రాంగణం లో చారిత్రాత్మక భారత సంవిధాన (రాజ్యాంగ పీఠిక) శిలాఫలకాన్ని మాయం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్ద పల్లి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంస్థ రాష్ట్ర కార్యదర్శి బాలసాని వెంకటేశం తెలిపారు.పెద్దపల్లి పట్టణంలోని నూతనంగా నిర్మాణం చేస్తున్న నేటి బస్ డిపో ప్రాంగణంలో ఆనాటి పెద్దపల్లి పంచాయతీ సమితి ఆవరణలో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 15 ఆగస్టు 1972 నుండి 14 ఆగస్టు 1973 మధ్య కాలంలో భారత ప్రభుత్వం చేత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్థాపించబడిన చారిత్రాత్మక భారత సంవిధానము రాజ్యాంగ పీఠిక హిందీ మరియు తెలుగు అక్షరాలతో కూడిన రాతి శిలాఫలకం ఉండేదని, దేశ స్వాతంత్ర్య అమరవీరుల త్యాగాలకు, రాజ్యాంగ గౌరవానికి ప్రతీకగా దశాబ్దాలుగా ఈ శిలాఫలకం ఇక్కడ పూజలందుకుంటూ,ప్రజలకు స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ఇది సామాజిక శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్య గా భావించి, పోలీసులు ఈ విషయంపై తక్షణమే స్పందించి, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని



గుర్తించి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ లకు పిర్యాదు చేసినట్లు వెంకటేశం తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలను సస్పెండ్ చేసే అధికారం ఎవరిచ్చారు?



ప్రజాపక్షం/ముత్తారం : గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి సేవలందిస్తున్న తమను సస్పెండ్ చేయడంపై ఓ కాంగ్రెస్ కార్యకర్త తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఇన్నేళ్లుగా పనిచేస్తున్న తమకు అన్యాయం చేసి, కొత్తగా పార్టీలోకి వచ్చిన వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యకర్తలను పార్టీ నుంచి తొలగించే అధికారం ఎవరిచ్చారని మీడియా ముఖంగా ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్యను వార్డు మెంబర్‌గా పోటీ చేయించేందుకు పార్టీ అవకాశం ఇవ్వాలని కోరినప్పటికీ, తనకు అవకాశం కల్పించకుండా కొత్తగా పార్టీలోకి వచ్చిన మరో అభ్యర్థికి అవకాశం ఇచ్చారని తెలిపారు. దీంతో తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి, తన భార్యను గెలిపించుకున్నానని పేర్కొన్నారు. కార్యకర్తలకు న్యాయం చేయాలి : పార్టీ కోసం రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత వర్గ విభేదాల కారణంగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అన్యాయం జరగకూడదని అన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం ఎవరిచ్చారు? అసలు ఏ కారణంతో ఈ చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు పార్టీ నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన మీడియా ముఖంగా డిమాండ్ చేశారు.

కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన

ప్రజాపక్షం/కెరమెరిః మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజు సూచించారు. గురువారం మండల కేంద్రంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ ఈ నెల 31న నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో పాల్గొని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది, మాలి సంఘం మండల అధ్యక్షుడు కొట్రంగే తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు పాల్పడిన పెద్దపల్లి సిఐ సస్పెండ్ చేయాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ ప్రతినిధి : బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులే నిందితుల పక్షాన నిలిచి,దళితులను కులం పేరుతో దూషిస్తూ దాడులకు పాల్పడటం చట్టవిరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు.పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ కులం పేరుతో దూషణలు,దాడులకు గురైన బాధితులను పెద్దపల్లి లో కలిసి పరామర్శించి,ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ రాఘవాపూర్ గ్రామంలో జరిగిన గొడవను ఇరువర్గాల మధ్య రాజీ కుదిరిన తర్వాత కూడా,కాంగ్రెస్ నాయకుడు,మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేష్ ప్రోద్బలంతో దళిత యువకులపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు ఆరోపించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు.ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు, చట్టపాలనకు విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని,అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం కొందరు పోలీసులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తూ దళితులను వేధించడం, కేసుల్లో ఇరికించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆందోళనకరమని అన్నారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భూపాల్, అబ్బాస్,రమణ, జ్యోతి,కల్లేపల్లి అశోక్, సిపెల్లి రవీందర్,మోదుంపల్లి శ్రవణ్ పాల్గొన్నారు.



వరి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ ప్రతినిధి : వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ సుల్తానాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టింది.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కడారి అశోక్‌రావు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకునేందుకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తక్కువ ధరకు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంక శంకర్, తిరుపతి యాదవ్, రాజేంద్రప్రసాద్, చాతరాజు,చాతరాజు అజయ్,చాతరాజు వెంకటేష్, తదితర బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



పిటి స్వామి మృతి బిఆర్ఎస్‌కు తీరని లోటు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరుకంటి చందర్ మాట్లాడారు. ఈ ప్రాంత విద్యావేత్తగా అనేక మందికి విద్యాబుద్ధులు నేర్పి,మంచి మార్గంలో నడిపించిన పీటీ స్వామి పరమపదించడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటుగా భావిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.వారి సంస్మరణ సభ ఈ నెల 4వ తేదీన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మరియు సంయుక్తంగా ఆర్కే గార్డెన్ మార్కండేయ కాలనీలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున ఈ పారిశ్రామిక ప్రాంతంలో, రామగుండం నియోజక వర్గంలో ఉన్నటువంటి, పెద్దపల్లి జిల్లాలో ఉన్నటువంటి బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఉద్యమకారులు, కార్మికులు, కర్షకులు వేలాది మందిగా హాజరై పీటీ స్వామి గారి ఆత్మకు శాంతి చేకూరేలా హాజరు కావాలని కోరుతూ ఈ కార్యక్రమానికి గౌరవ నీయులు తన్నీరు హరీష్ రావు వస్తున్నటువంటి సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. నాలుగు అభివృద్ధి పనుల సాధనకు నవంబర్ 2న నిరాహార దీక్ష : పెద్దపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి, కుర్జీ కమ్మి భూములకు పట్టాలు,అంతర్గాం మంచిర్యాల మీదుగా గోదావరి వంతెన నిర్మాణం,ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు వంటి నాలుగు కీలక అభివృద్ధి పనులను ప్రభుత్వ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 2న అంతర్గాం మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష చేస్తున్నట్లు బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకొండ శంకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాలుగు కీలక అంశాలపై తక్షణమే స్పందించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు.ఈ నిరాహార దీక్షకు ప్రజలు,పార్టీ శ్రేణులు మద్దతు తెలిపాలని ఆయన కోరారు.



ఘనంగా గ్లోబల్ స్పేస్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానం,నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో గ్లోబల్ స్పేస్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ 2026–27ను విజయవాడ మారిస్ స్టెల్లా కళాశాలలో ఘనంగా నిర్వహించారు.వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాలయన్ స్పేస్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కే జి విపద్మలత, యూఎస్ఏ నాసా అంబాసిడర్ ఆఫ్రిజ్ ఏఐ మామున్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అంతరిక్ష విజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనలు,నూతన ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యూ హెచ్ ఆర్ సి జాతీయ ప్రతినిధి రావూరి బాలాజీ రాజు,తెలంగాణ స్టేట్ డైరెక్టర్ బడుగు లక్ష్మణ్,నేషనల్ డైరెక్టర్ S. నాగరాజు,పెద్దపల్లి జిల్లా జనరల్ సెక్రటరీ ఎండి అస్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పలు శుభకార్యాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుల ఆదేశాల మేరకు ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పరిధిలోని పలు శుభకార్యాల్లో పాల్గొని సందడి చేశారు.నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీకరీంనగర్‌లోని వసుంధర కన్వెన్షన్‌లో నిర్వహించిన ముత్తారం మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు ఆకోజ్ అశోక చారి కో బ్రదర్ కుమారుడు శశి కుమార్ చారి – సుచిత్రల వివాహ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ వివాహ వేడుకలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య,ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజీద్ పాషా తదితరులు హాజరై నూతన వధూవరులకు పుష్ప గుచ్ఛం అందించి, అక్షింతలు వేసి ఘనంగా ఆశీర్వదించారు. వివాహానికి విచ్చేసిన నాయకులకు వధూవరుల కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్కం ప్రభాకర్, తోడేటి శశికుమార్ తోపాటు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు న్యాయ అవగాహన

ప్రజాపక్షం/ముత్తారం : మంథని లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ముత్తారం మండలం దర్యాపూర్ లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంథని సబ్ కోర్టు న్యాయమూర్తి అపర్ణ పాల్గొని విద్యార్థులకు పోక్సో చట్టం–2012పై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అపర్ణ మాట్లాడుతూ బాలలపై జరిగే లైంగిక నేరాల నుంచి రక్షణ, పిల్లల హక్కులు, వ్యక్తిగత భద్రత, చట్టపరమైన రక్షణల గురించి వివరించారు.విద్యార్థులకు ఏదైనా అన్యాయం జరిగినప్పుడు భయపడకుండా చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ప్రతి విద్యార్థి చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, తమ హక్కులను తెలుసుకొని ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయశాఖ ప్రతినిధులు, ప్రముఖులు బాలల భద్రత, రక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

సర్టిఫికెట్ల ప్రదానం : అనంతరం పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు అభ్యసించి,ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు న్యాయమూర్తి అపర్ణ మేడం చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంథని కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సుధారాణి,సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అనూరాధా మేదం,మంథని ఏపీపీ ఆర్ధా కుమార్, సీనియర్ అడ్వకేట్ కేతిరెడ్డి రఘోత్తమ రెడ్డి, పోలీస్ సిబ్బంది, రాజయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థులకు ద్విభాషా నిఘంటువుల పంపిణీ



ప్రజాపక్షం/బాల్కొండ : మండల కేంద్రం లోని పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పిఎంశ్రీ పథకం కింద ద్విభాషా నిఘంటువులను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించటం, నూతన పదాలను నేర్చుకునేలా ప్రోత్సహించటం, పదజాలాన్ని విస్తృతం చేయడం, స్వయంగా చదివి అర్థం చేసుకునే సామర్థ్యాన్ని మెరుగుపర్చటం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల కోసం ఒక్కొక్కటి సుమారు రూ.270 విలువ కలిగిన 333 శంకర్ నారాయణ ద్విభాషా నిఘంటువులను పిఎం శ్రీ పథకంతో అందజేశారు. ఈ నిఘంటువులు విద్యార్థులకు ఆంగ్ల పదాల అర్థాలను తెలుసుకోవటంలో, ఆంగ్ల భాషపై పట్టు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్, సూపరింటెండెంట్ రమణ, సీనియర్ ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఉన్నతమైన సేవలు

ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లా కేంద్రం లోని యశోధ ఆస్పత్రిలో ఆధునాతన వైద్య సేవలు కలవని వైద్యులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కిడ్నీ, మూత్రనాళం, ప్రోస్టేట్, కిడ్నీ మార్పిడితో సహా సంబంధిత యూరాలజికల్ సమస్యలకు సోమాజిగూడ యశోధ ఆస్పత్రిలో ఆధునాతన వైద్య సేవలు పొందవచ్చని మాట్లాడుతూ కిడ్నీ రాళ్లు, మూత్రనాళ రుగ్మతలకు చికిత్స చేయకుండా వదిలేస్తే అవి జీవన నాణ్యతను గణనీయంగా ప్రభావితం చేస్తాయన్నారు. లేజర్ విధానాలు, మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీలతో సహా ఆధునిక చికిత్స పద్ధతులు, అర్హులైన రోగులకు సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తున్నాయన్నారు. అలాగే ఇతర ప్రాంతాల ప్రజలు ధీర్ఘకాలిక, కిడ్నీ, మూత్ర సంబంధిత లక్షణాల కోసం సకాలంలో నిపుణుల సలహా తీసుకుని హైదరాబాద్ సోమాజిగెడలోని యశోధ ఆస్పత్రిలో తగిన చికిత్స విధానాలు తీసుకోవాలన్నారు. యశోధ గ్రూప్ వైద్య శస్త్రచికిత్సలోని ప్రతి స్పెషాలిటీ సబ్ స్పెషాలిటీలో ఆధునాతన రోగ నిర్ధారణ, చికిత్స సంరక్షణను అందిస్తూ వైద్య నైపుణ్యాన్ని ఆధునిక విధానాలను కలిగి ఉందన్నారు. సమావేశంలో అమర్‌నాథ్‌బాబు తదితరులున్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : విద్యాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధి సాధించాలని హాసకొత్తూర్ సర్పంచ్ రేవతి గంగాధర్ అన్నారు. గురువారం మండలంలోని హాసకొత్తూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం యూనిఫామ్‌లను, పుస్తకాలను అందజేస్తున్న ప్రభుత్వం ఈ సారి నూతనంగా నాణ్యత కలిగిన షూస్‌లను కూడా అందజేస్తుందన్నారు.

పిఎసిఎస్ చైర్మన్ పదవులు పాత నేతలకా... వలస నేతలకా ?

ప్రజాపక్షం/ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం పిఎసిఎస్ చైర్మన్ పదవుల భర్తీపై కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ కోసం కష్టకాలంలో పని చేసిన పాత నేతలకు అవకాశం దక్కుతుందా ? లేక తర్వాత పార్టీలో చేరిన నేతలకు ప్రాధాన్యత లభిస్తుందా ? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. చేపూర్ గ్రామానికి చెందిన మాజీ మండల అధ్యక్షులు ఎస్‌కె.చిన్నారెడ్డి తండ్రి ఎస్‌కె.చిన్న గంగారాం అలియాస్ స్పెషల్‌రెడ్డి, పెర్కిట్ గ్రామానికి చెందిన రవేందర్‌రెడ్డి అలియాస్ చిట్టీరెడ్డి పేర్లు ఆశావాహుల చర్చలో జోరుగా వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరిలో టీపీసీసీ అధికార ప్రతినిధి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎబి చిన్నా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఎవరికి మద్దతు ఇస్తారు ? ఎవరికి అవకాశం కల్పిస్తారు ? అన్నది ఆసక్తికరంగా మారింది. పాత నేతల సేవలకు గుర్తింపు ఇస్తారా ? లేక కొత్త నేతలకు అవకాశం కల్పిస్తారా ? అనే ప్రశ్నకు అధిష్టానం నిర్ణయంతోనే సమాధానం లభించనుంది. పిఎసిఎస్ పదవుల ఎంపికలో పార్టీ కోసం చేసిన సేవలు సీనియారిటీ, రైతులతో ఉన్న అనుబంధానికి ప్రాధాన్యతనిస్తారా ? అన్నది వేచి చూడాల్సిందే. పాత నేతలకు న్యాయం జరుగుతుందా ? వలస నేతలకు అవకాశం దక్కుతుందా ? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. పిఎసిఎస్ చైర్మన్ పదవుల కేటాయింపు ఆర్మూర్ నియోజకవర్గ రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాలి.



స్టోన్ క్రషింగ్ ప్లాంట్‌లో బ్లాస్టింగ్ ఇళ్లకు బీటలు

ప్రజాపక్షం/నిజామాబాద్ : స్టోన్ క్రషింగ్ ప్లాంట్‌లో బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లకు బీటలు ఏర్పడి నష్టం వాటిల్లుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న స్టోన్ క్రషింగ్ ప్లాంట్‌లో రాళ్లను పేల్చేందుకు చేపడుతున్న బ్లాస్టింగ్ కారణంగా గ్రామంలోని పలు ఇళ్లకు బీటలు ఏర్పడుతున్నాయి. దీంతో అక్కడి ఇళ్ల గోడలు దెబ్బ తింటున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. బ్లాస్టింగ్‌తో ఇళ్లకు నష్టం వాటిల్లటంతో పాటు ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడి పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరముంది. ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, బ్లాస్టింగ్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా ? లేదా అనే అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి జాన్కంపేట్ గ్రామశివారులోని స్టోన్ క్రషింగ్ ప్లాంట్‌పై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, బ్లాస్టింగ్ కారణంగా దెబ్బ తిన్న ఇళ్లను అధికారుల బృందంతో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి జాన్కంపేట్ గ్రామశివారులోని స్టోన్ క్రషింగ్ ప్లాంట్‌పై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, బ్లాస్టింగ్ కారణంగా దెబ్బ తిన్న ఇళ్లను అధికారుల బృందంతో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తేలితే ప్లాంట్ యాజమాన్యంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి, గ్రామస్తుల ఇళ్లకు మరింత నష్టం జరగకుండా ప్రజల ప్రాణాలకు ఆస్తులకు ప్రమాదం కలగకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ప్రజావాణిలో గ్రామానికి చెందిన పి.నాగేష్ విన్నవించినప్పటికీ జిల్లా సంబంధిత అధికారులు పరిశీలించామని మండల అధికారికి ఆదేశాలు జారీ చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కొంతమంది అధికారులు ప్లాంట్ యాజమాన్యంకు వత్తాసు పలుకుతూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్లాంట్ యాజమాన్యం నష్టపోయిన కుటుంబాలకు నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారమందేలా చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యే వరకు ప్రజల భద్రతకు ముప్పు కలిగించే బ్లాస్టింగ్ కార్యకలాపాలను నిలిపివేయడానికి అవసరమైన చర్యలు చేపట్టి గ్రామస్తులకు సపోర్ట్‌గా నిలవాలని కోరుతున్నారు.



ప్రశస్తి యాప్‌పై అవగాహన



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్తి యాప్‌లో అప్‌లోడ్ చేయాలనే దానిపై అవగాహన కల్పించినట్లు ఎంఈఓ ఆంధ్రయ్య తెలిపారు. పాఠశాలలో చదువుచున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి వారిని ప్రశస్తి యాప్ స్క్రీనింగ్ ఓరియంటేషన్‌పై వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా ఆదినాగలక్ష్మి, మధుశేఖర్, రాజన్న, భవిత పాల్గొన్నారు.

సిసి డెనేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/బాల్కొండ: మండలంలోని ఇత్వార్‌పేట్ గ్రామంలో సీసీ డ్రైనేజీ పనులకు 2 లక్షల 30 వేలతో చేపట్టిన పనులను సర్పంచ్ పాతకాల సంతోష్ ప్రారంభించారు. గ్రామంలో పేరుకు పోయిన మురుగు కాలువ నిర్మాణంతో ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అజీమ్, కార్యదర్శి నసీరుద్దీన్, కారోబార్ భూమేశ్వర్ ప్రజలు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పోరాట యోధుడు గుజ్జ రమేష్

ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్: సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన గుజ్జ రమేష్ మరణం కార్మిక లోకానికి తీరని లోటని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య పేర్కొన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన రమేష్ దశదిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ ఎంవికె 3 గనిలో పనిచేసిన రమేష్ కార్మికులకు అన్యాయం జరిగిన ప్రతిసారీ ముందుండి పోరాడారని గుర్తుచేశారు. 1978లో జరిగిన రాజేశ్వరి ఘటనపై బాధితులకు న్యాయం కోసం ఉద్యమించి జైలు జీవితం కూడా అనుభవించారని తెలిపారు. రాడికల్ యువజన సంఘం పిలుపుతో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో పాల్గొన్నారని, జన నాట్య మండలి భూ బాగోతం నాటకం ద్వారా ప్రజలను చైతన్యపరిచారని వివరించారు. రమేష్ ఆశయ సాధనకు కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు రాజనర్సు, దేవయ్య, స్వామి, రాజన్న, మురళి, పోషన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదింపు.. పాత నేరస్థుడి అరెస్ట్



ప్రజాపక్షం/మావల: మావల న్యూహౌసింగ్ బోర్డులో ఇంటి తాళాలు పగులగొట్టి రూ.27,500 విలువైన బంగారు, వెండి ఆభరణాల చోరీకి పాల్పడిన రాంనగర్‌కు చెందిన పాత నేరస్థుడు సమీర్ ఖాన్(28)ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ బి.డి.ప్రేమ్ కుమార్ తెలిపారు. బాధితుడు కల్లెం గణేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నామన్నారు. నిందితుడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో గతంలో 19 కేసులు ఉన్నాయని వెల్లడించారు.

చట్టసభల్లో బిసిల ప్రాతినిధ్యం పెరగాలి



ప్రజాపక్షం/మావల: అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులు, బీసీ వర్గాలు చట్ట సభల్లో తమ సంఖ్యాబలాన్ని పెంచుకోవాలని టీఆర్‌పి నాయకురాలు పడిగల శ్రావణి ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ గాంధీ పార్క్‌లోని భీమన్న ఆలయంలో ధారవేణి రాము ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సన్మానంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 50 నియోజకవర్గాల్లో గెలుపోటములను శాసించే ముదిరాజులు చట్టసభల్లోకి వెళ్లేలా ఆదిలాబాద్ నుంచే ఉద్యమించాలని, బడుగుల రాజ్యాధికారం కోసం కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పనిచేస్తున్నామని అన్నారు. ఈ నెల 30న ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలన్నారు.

రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలి



ప్రజాపక్షం/మావల: వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన ఎంబీఏ విద్యార్థి కంబ్లె రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. గురువారం రిమ్స్ ఎదుట కాలనీవాసులు, సంఘాల నాయకులు చేపట్టిన ధర్నాకు జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్‌తో కలిసి సంఘీభావం తెలిపారు. జాయింట్ కలెక్టర్, రిమ్స్ డైరెక్టర్‌ను కలిసి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, వసంత్, రాజన్న, ధర్మాపాల్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులు ఆన్‌లైన్ ప్రశస్తి యాప్‌లో నమోదు

ప్రజాపక్షం/భీమ్‌గల్ : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో దివ్యాంగ విద్యార్థులున్నట్లయితే వారిని సమగ్రశిక్షా ప్రశస్తి యాప్‌లో నమోదు చేయాలని ఎంఈఓ స్వామి పేర్కొన్నారు. గురువారం భీమ్‌గల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ఎంఈఓ స్వామి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు సాధారణ విద్యార్థులతో సమానంగా అన్ని సౌకర్యాలు అందించటానికి ప్రభుత్వం ప్రసస్త్ యాప్ ప్రవేశపెట్టిందన్నారు. యాప్ పేర్కొన్న వైకల్య లక్షణాలున్న విద్యార్థులను తప్పనిసరిగా పొందుపర్చాలన్నారు. దీంతో అంగవైకల్యం గల విద్యార్థులకు ప్రత్యేక విద్య, వైద్యంతో పాటు వారికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలన్ని లభిస్తాయన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అన్ని తరగతుల దివ్యాంగ విద్యార్థులను గుర్తించాలని కోరారు. స్పెషల్ ఎడ్యుకేటర్ రామకృష్ణ, ఐఈఆర్‌పీ జలందర్ యాప్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ ఎల్ల శేఖర్, ఉపాధ్యాయులు లింబాద్రి, కిషన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిఎం మునిగంటి శ్రీనివాస్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ఃఃః

ఇందిరమ్మ ఇళ్లకు ఎన్నో గండాలు!

తగ్గని సిమెంట్,స్టీల్ రేట్లు, ఇసుక కూడా దొరకని వైనం



ప్రజాపక్షం/ముధోల్ : నిరుపేదల సొంతింటి కల సాకారం చేద్దామని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది.ప్రభుత్వం ప్రతి ఏటా నిరుపేదల కోసం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఎన్నో ఇళ్లు మంజూరు చేస్తూ వస్తోంది.ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించినప్పటి నుండి ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఇటుక, ఇసుక, స్టీల్,సిమెంట్ ల ధరలు పెరుగుతూనే ఉన్నాయే తగ్గ ముఖం పట్టడం లేదు.ధరల నియంత్రణ లేకపోతే ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల ఆర్థిక సహాయం ఇళ్ల నిర్మాణానికి సరిపోయేనానని పెద్ద ప్రశ్నగా మారింది.అంతే కాకుండా మేస్త్రీలం దరూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక పది,ఇరవై వేలు అటు ఇటు అయిన రెండున్నర లక్షల పైనే తీసుకుంటున్నారు తప్ప తక్కువ డబ్బులకు కట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.ఇళ్లు నిర్మించే మేస్త్రికే ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తే ఇక నిర్మాణానికి అవసరమైన సామాగ్రికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు దాటిపోతుంది.ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన నిరుపేదలపై ఆర్థిక భారం పడక తప్పదం లేదు.ఇక దిక్కుతోచక గూడు ఉండిపోతోందనే ఒక ఆశతో అప్పైన చేసి ఇంట్లు కట్టుకుంటున్నారు. అధిక ధరలపై అధికారులు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది : ఇటుక రేట్లు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అమ్ముకుంటున్నారు.సంబంధిత అధికారులు ఇటుక బట్టీలను పర్యవేక్షించి వారు ఇటుక తయారీకి వాడకానికి అవసరమయ్యే సామాగ్రికి అవసరయ్యే ఖర్చు అంచనా వేసి నిరుపేదలకు మోసం జరగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి మార్కెట్లో అమ్ముతున్న రేట్లు సరైనవా లేక అధిక ధరలు వసూలు చేస్తున్నారా బాధ్యతగా తెలుసుకుని వాటిని ఏ ధరకు అమ్మాలో ఆదేశించాల్సిన అవసరం ఉంది.వర్షాకాలంతో పాటు సంవత్సరాంత్రము ఒకే ధర అమ్మడం ఎంత వరకు సమంజసమో అది కూడా అధికారులు దృష్టిలో ఉంచుకుని ఇటుక బట్టీ నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలి లేని యెడల వారిపై తగిన చర్యలు తీసుకోవాలి.

ముధోల్ మండల ప్రజలు ఇసుక ఎక్కడినుండి తెచ్చుకోవాలో : ఇంటి నిర్మాణానికి అతి ముఖ్యమైన ఇసుక ముధోల్ మండల ప్రజలకు ఎక్కడినుండి తెచ్చుకోవాలో పెద్ద ప్రశ్నగా మారింది.దగ్గర ప్రాంతాల్లో ఎక్కడ కూడా ఇసుక క్వారీలు లేవు.మరి ఎక్కడినుండి ఇసుక తెచ్చుకోవాలో మండల ప్రజలు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి ఇసుక తెచ్చుకోవాలనుకుంటే అనుమతులున్నాయా అని ఇటు పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు అడుగుతున్నారు.ఐతే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే లబ్ధిదారులకే ఇలాంటి అడ్డంకులు ఎదురవుతున్నాయి.బడా బాబులకు మాత్రం ఎంత పెద్ద మొత్తంలో ఇసుక వచ్చిన అడిగే వారే లేరు.మరి ఇలాంటి పరిస్థితుల్లో నిరుపేదలు ఇళ్లలు నిర్మించుకోవాల్సింది ఎలా. ఇందిరమ్మ లబ్ధిదారులకు సరైన మార్గం చూపి న్యాయం చేస్తారని ఆకాంక్షిస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.డి.సంధాని

ప్రజాపక్షం / మందమర్రిः విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుంటూనే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.డి.సంధాని పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచిర్యాల జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎం.డి.సంధాని మాట్లాడుతూ విద్యార్థులు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలన్నారు. పోక్సో చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టం, బాల్యవివాహాల నిషేధం, మోటారు వాహనాల చట్టాలపై అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధం, ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన చర్యలు, రహదారి భద్రతా నియమాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిపుణులు ఆర్.శ్రీనివాస్, సబ్బాని సదయ్య, ఆర్.రాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హక్కులు తెలిపిన జడ్జ్ రవీందర్

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మరియు అమెరికిడ్స్ పాఠశాలలో అలాగే రాజుర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయా గ్రామాల సర్పంచులు ఆధ్వర్యంలో జిల్లా జడ్జి రవీందర్ బాలల హక్కుల గురించి తెలిపారు ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని ,విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని పిల్లల హక్కులు భాగ స్వామ్యం గురించి,సైబర్ నేరగాలను నమ్మకుండా ఓటిపిలు , బ్యాంకు అకౌంట్ నంబర్లు చెప్పకూడదని ,అపరిచితులకు డాటా ఇవ్వకూడదని,ఆన్లైన్లో ఫ్రెండ్షిప్ చేసి మోసపోకూడదని, అసభ్యకరమైన ఫోటోలు పెట్టకూడదని, గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి తెలియజేయడం, మైనర్ల కు ఇష్టం లేని పెళ్లిళ్లు చేయకూడదని,ఒకవేళ చేస్తే సఖి సెంటర్‌ను సంప్రదించాలని తదితర అంశాలపై జడ్జ్ తెలిపారు.సర్పంచ్ శ్యామల,ఉప సర్పంచ్ సురేష్,ఉమెన్ రైట్స్ చైర్మన్ సరస్వతి,నాయకులు సాయి,ప్రసాద్ ,రోహిత్,కలీం,ఉపాధ్యాయులు, విద్యార్థులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా లీగల్ అవేర్నెస్ క్యాంప్ ఆన్ పోక్సో యాక్ట్ 2012 అవగాహన



ప్రజాపక్షం/భైంసా : భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం కిసాన్ గల్లి పాఠశాల భైంసా లో సీనియర్ సివిల్ జడ్జి ,T, రవీందర్ సీఐ సాయికుమార్,టౌన్ ఎస్సై దయాళ్ సింగ్,అంజత్ షేక్ , సురక్షిత్ బచ్చన్ అభియాన్ లో పాల్గొని విద్యార్థులకు, ఆచార్యులకు,సిబ్బంది కి చట్టం గురించి చాలా చక్కగా మార్గదర్శనం చేయడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు భోజన్న పాఠశాల సిబ్బంది.విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టపగలే అక్రమ క్రమ.. అధికారుల పర్యవేక్షణ ఏది?

ప్రజాపక్షం/కౌటాలः కౌటాల మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు, ఏర్పాటు యథేచ్ఛగా సాగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం మండల కేంద్రంలోని వర్షపు నీటి డ్రైనేజీపై అక్రమంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే డ్రైనేజీలపై భవనాలు, దుకాణాలు ఇతర నిర్మాణాలు ఉండగా, తాజాగా మరో వెలవడంతో పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారిపై దుకాణాలు, వాహనాల రాకపోకలతో నిత్యం తీవ్ర రద్దీ నెలకొంటూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పాత పిహెచ్‌సి భవనం ముందు కూడా ్డా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎల్ నినో ప్రభావం నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సూచన



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఎల్నినో ప్రభావం నేపథ్యంలో పట్టణంలో తాగునీటి వినియోగం, పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సూచించారు.నీటి వృథాను అరికడుతూ,భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులకు పిలుపునిచ్చారు.నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా,పారిశుద్ధ్య నిర్వహణ,వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలు,మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు,వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి వార్డులో కౌన్సిలర్లు ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటా నీటిని బాధ్యతాయుతంగా వినియోగించేలా ప్రజలను చైతన్యపరచడంతో పాటు, నీటి వృథాను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు.కౌన్సిలర్లు ప్రస్తావించిన అంశాలపై స్పందించిన వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి.. సంబంధిత మున్సిపల్ అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు తెలిపారు.పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని వైస్ చైర్మన్ పేర్కొన్నారు.వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణను పటిష్ఠం చేయడంతో పాటు,తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటికి పరిష్కారం చూపడం ద్వారా పురపాలక సేవలను మరింత మెరుగుపరచాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి బాబు,మేనేజర్ మారుతీ,శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్,మున్సిపల్ అధికారులు, సిబ్బంది,కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

దిల్వార్‌పూర్ ఎస్‌సి బాలుర హాస్టల్ తనిఖీ

ప్రజాపక్షం/దిల్వార్‌పూర్ : మండలంలోని కాల్వ గ్రామ పంచాయతీ రికార్డులను,దిల్వార్‌పూర్ లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం మండల పరిషత్ అధికారి (ఎంపిఒ) గోవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కల్వా గ్రామ పంచాయతీలో నిర్వహించే వివిధ రికార్డులు,రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి పంచాయతీ నిర్వహణపై పలు సూచనలు చేశారు.అనంతరం దిల్వార్‌పూర్ మండల కేంద్రంలోని ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఎంపిఒ,అక్కడ విద్యార్థులకు అందుతున్న వసతులు,భోజనం నాణ్యత,పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని,ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులను నిర్వహించాలని సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలించిన

ఎమ్మెల్యే అనిల్



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు (సులబ్ కాంప్లెక్స్) పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం పరిశీలించారు.నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.త్వరలోనే ప్రయాణికులకు మరుగుదొడ్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రయాణికుల కొరకు ఇటీవలే హైమాస్ లైట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్,ప్రీతం రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్,దేవేందర్ రెడ్డి, వెంకట్రావు, సుజీల్,గాడ్గే సుభాష్,తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్ లో ఓపెన్ హౌస్

ఆకట్టుకున్న విద్యార్థుల సందర్శన

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నిర్మల్ టౌన్ లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ డిఎస్పి శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్మల్ టౌన్ లోని దీక్ష జూనియర్ కళాశాల, విన్నర్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని పోలీస్ స్టేషన్ పనితీరును, పోలీసు విధులు,ఆయుధాల వినియోగాన్ని ఆసక్తిగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ ప్రాముఖ్యత, నేరాల నివారణ,డ్రగ్స్,చెడు అలవాట్లకు దూరంగా ఉండటం వంటి అంశాలపై డిఎస్పి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని,అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది మరియు ఆయా పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి,రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు.కళాశాల ప్రాంగణంలో బతుకమ్మలను ఏర్పాటు చేసి విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కార్యక్రమ నిర్వహణలో చురుగ్గా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు, బతుకమ్మ పాటలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ కార్యక్రమం అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్,అధ్యాపకులు,ఎన్ఎస్ఎస్ అధికారులు కృష్ణ,విద్యార్థులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో అలరించిన నిర్మల్ ఉపాధ్యాయుల నాటకం

సైబర్ నేరాలపై చైతన్య ప్రదర్శన

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : హైదరాబాదు లోని ప్రసిద్ధ రవీంద్రభారతి ప్రాంగణంలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల ఎంపిక ప్రక్రియలో నిర్మల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు విశేష ప్రతిభ కనబరిచారు. నాటక విభాగంలో పాల్గొన్న వీరు సమాజాన్ని తీవ్రంగా వేధిస్తున్న సైబర్ నేరాల ముప్పు, వాటి వెనుక ఉన్న మోసాలు మరియు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిష్కార మార్గాల గురించి కళ్ళకు కట్టినట్లు నాటక రూపంలో ప్రదర్శించారు.ఈ నాటక ప్రదర్శనలో భాగంగా మాంత్రికుడి పాత్రలో కూచినపల్లి (శ్రీనివాస్ ఎలగడప), తల్లిదండ్రుల పాత్రల్లో మరపాక భీమయ్యరాయదారి), వాణిశ్రీ పార్‌పెల్లి), కొడుకు పాత్రలో బామాండ్ల శంకర్ కొత్త చెరువుగూడా), పోచమ్మ తల్లి పాత్రలో బసవ రాజు రామ్ టెక్) మరియు డాక్టర్ పాత్రలో మాలవత్ బిక్షపతి నాయక్ నిర్మల్) తమ అద్భుత నటనతో అలరించారు.సమాజానికి ఎంతో అవసరమైన ప్రయోజనాత్మక సందేశాన్ని నాటక రూపంలో చక్కగా అందించిన ఉపాధ్యాయుల సృజనాత్మకతను, నటనను నాటకాన్ని వీక్షించిన ప్రేక్షకులు, నిర్వాహకులు ఎంతో అభినందించారు. రాష్ట్ర స్థాయి వేదికైన రవీంద్రభారతిలో తమ ప్రతిభను చాటుకునేందుకు ప్రోత్సహించి, తగిన అవకాశం కల్పించిన జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న గారికి నాటక బృందంలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో పిలుపు

ప్రజాపక్షం/సారంగాపూర్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,నిర్మల్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై లైంగిక నేరాల నిరోధం మరియు బాలల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని బీరవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడం,బాలల హక్కులను పరిరక్షించడం,బాల్యవివాహాల నిరోధం,బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు,బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పి ఓ సి ఎస్ ఓ చట్టం–2012 కీలకమైనదని పేర్కొన్నారు.పిల్లలపై ఏదైనా నేరం జరిగినట్లు తెలిసినప్పుడు చట్టప్రకారం సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని,బాధిత పిల్లల గోప్యతను కాపాడాలని సూచించారు.బాల్యవివాహాలు పిల్లల విద్య,ఆరోగ్యం,భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని,వాటిని అరికట్టేందుకు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,అధికారులు మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.బాధిత పిల్లలకు అవసరమైన



రక్షణ,కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పిల్లల సమస్యలను గుర్తించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.ప్రతి బాలుడు, ప్రతి బాలిక భయం లేకుండా,వేధింపులకు దూరంగా,గౌరవంగా జీవించే సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెండవ అడిషనల్ జె ఎఫ్ సి ఎం . న్యాయమూర్తి బి. నికిత మేడం గారు, షేర్.నరేందర్ గారు న్యాయవాది,సారంగాపూర్ SI శ్రీకాంత్,ఇతర శాఖల ప్రతినిధులు మరియు స్థానిక సర్పంచ్ బ్యాగరి గంగవ్వ,ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలో గల తెలంగాణ మోడల్ స్కూల్ లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు.పాఠశాలకు వచ్చినా ఎమ్మెల్యేకి విద్యార్థినీలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాలలో గల సమస్యలను 9వ తరగతి విద్యార్థినిలు అందించగా వారికి సానుకూలంగా స్పందించారు. క్రీడల కొరకు గ్రౌండ్ లో కావాలన్న గ్రావెల్కచ్చితంగావెయిస్తామన్నారు.అదేవిధంగా లైట్ల సమస్య ఉందని తెలిపారు. కచ్చితంగా తక్షణమే వాటి సమస్యను తీర్చుతామన్నారు.అదేవిధంగా ఎప్పుడూ ఏ అవరం ఉన్న నేనున్నా అండగా ఉంటా అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విద్యార్థినిలకు భరోసా కల్పించారు.నియోజకవర్గ కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ పాఠశాలకు గొప్ప పేరును తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.మోడల్ స్కూల్ ను ప్రైమరీ



మోడల్ స్కూల్ గా మార్చాలని రెండు రోజుల క్రితమే విద్యాశాఖ కార్యదర్శిని కలవడం జరిగిందన్నారు.త్వరలోనే ప్రైమరీ మోడల్ స్కూల్ గా మార్చి విద్యార్థులకు విద్య సేవాలందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్,సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు రాజు రెడ్డి,రూప్చంద్,సంజయ్,బాబులాల్,ఎలుక రాజు,నాయకులు పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్,యూత్ అధ్యక్షులు ప్రవీణ్,నాయకులు రాకేష్ రెడ్డి,సంజీవ్,రమణ గౌడ్,గంగమల్లు,తదితరులు పాల్గొన్నారు.

బీరవెల్లి జెడ్పిహెచ్ఎస్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించిన జడ్జి బిసి నిఖిత

ప్రజాపక్షం/సారంగాపూర్ : మండలంలోని బీరవెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్మల్ జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా జూనియర్ సివిల్ జడ్జ్ బిసి నిఖిత హాజరై విద్యార్థులకు చట్టాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.ముఖ్యంగా చిన్న పిల్లల రక్షణ చట్టమైన పోక్సో యాక్ట్ గురించి విద్యార్థులకు వివరిస్తూ, చట్టాలపై పూర్తి జ్ఞానాన్ని పెంచుకొని నిత్యజీవితంలో వాటిని సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు.విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.ఏవైనా న్యాయపరమైన లేదా అత్యవసర సమస్యలు ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 లేదా పోలీస్ సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సదస్సులో పదో తరగతి విద్యార్థిని దుర్గ మాట్లాడగా, ప్రదర్శించిన అవగాహన పట్ల విద్యార్థులు ఆసక్తి చూపించారు. పాఠశాల హెచ్ఎం వై. సాయన్న,గ్రామ సర్పంచ్ బ్యాగరి గంగమ్మ ఎల్లన్న,సారంగాపూర్ ఎస్సై, న్యాయవాదులు నరేందర్,రాజేశ్వరరావు రత్నం,సిరాజ్, సభ్యులు గంగన్న,రాజేశ్వర్,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



భూముల రీసర్వేపై అపోహలొద్దు

కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : జిల్లాలో రీసర్వే పై గ్రామ ప్రజలకు ఎలాంటి అపోహలు వద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గ్రామ ప్రజలకు సూచించారు. ్ఛించారు మండలంలోని ఏక్లాస్ పూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి భూముల రీ సర్వే గ్రామసభలో కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ గ్రామంలో నిర్వహించబోయే భూభారతి రి సర్వే గురించి ఎలాంటి అపోహలు వద్దన్నారు. భూములకు పటిష్టంగా హద్దులు నిర్ణయించబడుతుందన్నారు. గ్రామంలో ఉన్న 718 ఎకరాల్లో సర్వే నిర్వహించి ఎలాంటి భూ సమస్యలు ఉన్న 60 రోజుల ముందు నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామని గ్రామస్తులకు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు , గ్రామకంఠం, ఫారెస్ట్, అసైన్డ్, చెరువు, కుంట భూముల అనంతరం పట్టా భూములను సర్వే నిర్వహించి భూ తగాధాలు లేకుండా తీర్చిదిద్దుతామన్నారు.

నిర్మల్ జిల్లాను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలి

బిజెపి నాయకుడు రావుల రాంనాథ్ డిమాండ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా నిర్మల్ జిల్లాను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ డిమాండ్ చేశారు.గురువారం నిర్మల్ టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో తీవ్ర పారదర్శకత లోపించిందని విమర్శించారు.స్వయంగా ముఖ్యమంత్రే రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయని,ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి ఎద్దడి,విద్యుత్ సమస్యలు ఉంటాయని చెప్తూనే,కేవలం 365 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.నిర్మల్ జిల్లాలో కేవలం 8 మండలాలనే కరువు మండలాలుగా గుర్తించి, మిగతా మండలాల్లో కరువు లేదనడానికి ప్రభుత్వం వద్ద ఉన్న ఆధారాలు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం కంటితుడుపు చర్యగా కరువు మండలాలను ప్రకటించకుండా,కరువు నిధులను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు.అలాగే పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి 15,000 చొప్పున పరిహారం అందించాలని, నిర్మల్ జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన రైతులను, ప్రజలను ఆదుకోవాలని కోరారు.గుజరాత్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే ఎకరానికి 8,500 చొప్పున సహాయం ప్రకటిస్తూ ప్రజలను ఆదుకుంటుంటే, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కరువు నెపాన్ని కేంద్ర ప్రభుత్వంపైకి తోసేసే ప్రయత్నం చేస్తోందని రావుల రాంనాథ్ విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై ప్రజలకు,రైతులకు తగిన న్యాయం చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

శ్రీరామ నవమి వరకు రామాలయం నిర్మాణం పూర్తి చేస్తాం

ప్రజాపక్షం/భైంసా : నియోజకవర్గాన్ని ప్రణాళిక బద్ధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే కొంత మంది దుష్ట శక్తులు భైంసా ను అభివృద్ధి చేయడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.గురువారం భైంసా పట్టణం లోని రామ్ లీలా మైదానం లో 50 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న శివ రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా అయన మాట్లాడారు.రామనవమి వేళ ఇచ్చిన మాట ప్రకారం శివ రామాలయ నిర్మాణానికి 40 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు.వచ్చే శ్రీ రామ నవమి వరకు ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.. భవ్య మైనా రామ మందిరం నిర్మించు కోవడం ఎంతో అనందంగా ఉందని ఆలయాల్లో దేవత మూర్తులకు తానే స్వంత డబ్బులు వేచిస్తానన్నారు..తన హయం లో సరస్వతి అమ్మ వారీ ఆశీస్సుల తో బాసర ఆలయ నిర్మాణానికి 350 కోట్ల రూపాయల నిధులు మంజూరై పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అదే విధంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని త్వరలో నే ప్రారంభిస్తున్నామన్నారు. భైంసా లో అయ్యప్ప ఆలయ ని కి వెళ్లాడని 50 లక్షల రూపాయల నిధులతో సి. సి. రోడు వేయడం జరిగిందన్నారు. త్వరలో గట్టు మైసమ్మ ఆలయ రోడ్ కు నిధులు మంజూరు కావడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని త్వరలో నే పనులు ప్రారంభిస్తామన్నారు.. నియోజకవర్గం లో ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం తో పలు అభివృద్ధి పనులు చేస్తుంటే గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు..అంతకు ముందు కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, ప్రముఖ పూజారి బాబ్బు మహారాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి. గంగాధర్, కౌన్సిలర్ చింతపండు రజిత మహేష్, మాట్లాడుతూ భైంసా లో రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు వారు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.రామాలయం నిర్మించడం శుభప్రదం అన్నారు.కార్యక్రమం లో కౌన్సిలర్లు,నాయకులు పాల్గొన్నారు.

